క్లుప్తంగా

సర్పంచ్‌కు మాజీ ఎమ్మెల్యే అన్నా పరామర్శ


సర్పంచ్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అన్నా రాంబాబు

తర్లుపాడు: మండలంలోని తుమ్మలచెరువు గ్రామ సర్పంచ్ షాజహాన్ భర్త షేక్ రసూల్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో షాజహాన్‌తోపాటు కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు ఆదివారం పరామర్శించారు. పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట రామసుబ్బారెడ్డి, అబ్దుల్ తదితరులు ఉన్నారు.

కంభం చెరువును పర్యాటక కేంద్రంగా చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న స్వరూపదేవి

కంభం: కంభం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా స్వరూపదేవి అన్నారు. బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తీక వన భోజనాల కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కంభం చెరువును పర్యాటక కేంద్రంగా మారిస్తే ఇక్కడి ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. బలిజ సేవా సంఘం నాయకులు ఐకమత్యంతో ముందుకుసాగాలన్నారు. ఈ సందర్భంగా బాలికల నృత్య ప్రదర్శన ఆహూతులను అలరించింది. కార్యక్రమంలో బలిజ సేవా సంఘం నాయకులు తోట కోటేశ్వరరావు, ఆకుల వెంకటరంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు లేక ఇబ్బందులు


కొమరోలు : గ్రామసచివాలయం ఆవరణలో అసంపూర్తిగా మరుగుదొడ్లు

కొమరోలు: కొమరోలులో సులభ్ కాంప్లెక్స్‌లు లేకపోవడంతో స్థానిక ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం మండలంలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పనుల నిమిత్తం కొమరోలుకు వస్తూ ఉంటారు. అత్యవసర సమయంలో మలమూత్ర విసర్జనకు మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. మహిళల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కొమరోలులోని నాలుగు రోడ్ల కూడలి వద్ద కడప, విజయవాడ వెళ్లే ఆర్టీసీ బస్సుల కోసం ఎదురు చూసే ప్రయాణికులు మూత్రవిసర్జనకు తిప్పలు పడుతున్నారు. పురుషులు మాత్రం బ్రహ్మంగారి మఠం వీధిలో లేదా యూనియన్ బ్యాంక్ వీధిలోకి వెళ్లి పని కానిచ్చేస్తుండగా స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

అసంపూర్తిగా మరుగుదొడ్ల నిర్మాణం

కొమరోలు పట్టణంలోని గ్రామ సచివాలయం సముదాయంలో మరుగుదొడ్లు నిర్మించడానికి పనులు మొదలుపెట్టారు. మధ్యలోనే పనులు ఆపివేయడంతో మొండిగోడలు దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి మరుగుదొడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


పురుషులు బహిరంగ మూత్రవిసర్జన చేస్తున్న ప్రదేశం


నిలువెత్తు నిర్లక్ష్యం..
నీటికి కలగని మోక్షం!

- అలంకారప్రాయంగా తాగునీటి ట్యాంకులు
- మరమ్మతులు చేయించడంలో తీవ్ర జాప్యం
- క్లోరినేషన్ కూడా చేయించలేని దుస్థితి

గిద్దలూరు రూరల్: గిద్దలూరు నగర పంచాయతీతోపాటు మండలంలోని గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ట్యాంకులు పాలకుల నిర్లక్ష్యం, నిర్వహణ లోపం కారణంగా నిరుపయోగంగా మారాయి. నగర పంచాయతీలో బ్రిటన్ రోడ్డు, రాజానగర్, పాములపల్లె, మండలంలోని వెంకటాపురం, ముండ్లపాడు, కొంగలవీడు, పొదలకుంటపల్లె, దిగువమెట్ట, కె.ఎస్.పల్లె, అంబరం, త్రిపురాపురం, తంబళ్లపల్లె, తాళ్లపల్లె, గ్రామాల్లో నీళ్ల ట్యాంకులు దిష్టిబొమ్మల్లా మారాయి.

దిగువమెట్ట తండాలో ఓవర్ హెడ్ ట్యాంకు మెట్లు 6 నెలల క్రితం విరిగిపోవడం వల్ల శుభ్రం చేసేందుకు వీల్లేకుండాపోయింది. దీనికి తోడు ట్యాంకు చుట్టు చిల్లచెట్లు పెరిగిపోవడంతో దగ్గరికి వెళ్లలేని పరిస్థితి. దీంతో ట్యాంకు నుంచి కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోంది. కొంగలవీడు గ్రామంలో రెండు మినీ ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. చిల్లచెట్లలో ఒకటి ఉండిపోగా, మరొకదాని కుళాయిలు విరిగిపోయాయి. త్రిపురాపురం, పొదలకుంటపల్లె గ్రామాలల్లో ఓవర్ హెడ్ ట్యాంకుకులకు నీరు పైకి ఎక్కడం లేదు. బోర్లలో నీరు అడగంటాయని, అదనపు పైపులు దింపినట్లయితే నీరు ట్యాంకులకు ఎక్కే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఆ దిశగా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం వల్ల ట్యాంకులు నిరుపయోగంగా ఉండి శిథిలావస్థకు చేరుకుంటున్నాయని వాపోతున్నారు. మినీ ట్యాంకుల నిర్మాణానికి రూ.లక్ష నుంచి రూ.2 లక్షలు, మీడియం ట్యాంకుల నిర్మాణానికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణానికి రూ.25 నుంచి రూ.35 లక్షల వరకు ఖర్చు చేశారు. ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఇంత భారీ మొత్తంలో ప్రజాధనాన్ని వెచ్చించినా.. అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం వల్ల తిప్పలు పడాల్సి వస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి కైన సంబంధిత అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న ట్యాంకులకు మరమ్మతులు చేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


పొదలకుంటపల్లెలో వినియోగంలో లేని ఓవర్‌హెడ్ ట్యాంకు


దిగువమెట్ట తండాలో మెట్లు విరిగిన ఓవర్ హెడ్ ట్యాంకు



గిద్దలూరు బ్రిటన్ రోడ్డులో శిథిలావస్థకు చేరుకున్న మీడియం ట్యాంకు


కోటగడ్డ సచివాలయం వద్ద నిరుపయోగంగా మినీ ట్యాంకు


కొంగలవీడులో చిల్లచెట్లలో మినీ ట్యాంకు

రోడ్డుపైనే కారు.. జనం తకరారు!

పొదిలి: 'అమ్మా.. ఈ బజారులో నీరు పోయాలమ్మా కారు తీస్తే, ట్యాంకర్ ఇలా పోనిస్తాను. ఈ మధ్య నీటి కోసం బజారులో ఉంటున్నవాళ్లు ఇబ్బంది పడుతున్నారు'.. ఓ ట్యాంకర్ డ్రైవర్ వేడుకోలు..

'ఈ బజారులో వెళ్లటం కుదరదు. తిరిగి ఇంకో బజారున పోండి..' కారు యజమాని హుంకరింపు

'మేడం గారు అంగన్‌వాడీ కేంద్రంలో పాల ప్యాకెట్లు దించాలి. కారు పక్కకు తీయిస్తే..' ఓ ఆటో డ్రైవర్ విన్నపం..

'కారు డ్రైవర్ లేడు. పోండి ఇక్కడ నుంచి. ఇప్పుడు కారు తీయడం కుదరదంతే..' కారు యజమాని దబాయింపు

'అమ్మా కారు పక్కకు తీస్తే అటుగా కూరగాయల బండి తీసుకవెళ్తాను..' కూరగాయలు అమ్ముకునే మహిళ దేబిరింపు..

'వేళాపాల లేదా.. కారు తీయడం ఇప్పుడు కుదరదు. నీకు రోజూ చెప్పాలా..' కారు యజమాని చీదరింపు..

పొదిలి పట్టణంలోని ఇస్లాంపేటలో మట్టి రోడ్డులో ఓ కారును పార్కింగ్ చేసి ఉంచారు. పక్కనే డ్రెయినేజీ ఉంది. కనీసం ద్విచక్రవాహనం రాకపోకలు సాగించాలన్నా సర్కస్ ఫీట్ చేయాల్సిందే. అక్కడ నివాసం ఉండే వారందరూ సామాన్యులే. రోజువారీ పనులకు వెళ్లేవారు. రోడ్డుపై నిలిపిన కారుతో వారు పడుతున్న ఇబ్బంది గురించి అందరికీ విన్న వించారు. కారు యజమానిని బతిమలాడారు. అయినా ఫలితం లేదు. కారు అక్కడ నుంచి తీయలేదు. పాలు, నీరు, కూరగాయలు, రేషన్ బియ్యం బండి, ఆ వీధిలోకి వెళ్లడం లేదు. దీంతో స్థానికులకు కష్టాలు తప్పటం లేదు.


రోడ్డుపై నిలిపిన కారు

ఇంతకీ ఆ కారు ఎవరిదనేగా మీ అనుమానం. ఓ మండల స్థాయి రెవెన్యూ అధికారిణిది. ఆమెతో పేచీ ఎందుకని భావించిన స్థానికులు తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారు.

ఇసుక కొరతతో స్తంభించిన కార్మిక వ్యవస్థ


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కంభం: రాష్ట్రంలో ఇసుక కొరత వల్ల భవన నిర్మాణ కార్మిక వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రమేష్ పేర్కొన్నారు. ఆదివారం కంభంలో సీఐటీయూ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక కొరతతో పనులు లేక కార్మికులు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు వలస వెళ్లలేక వ్యవసాయ కూలీలుగా, కొందరు ఆటో డ్రైవర్లుగా, ఇంకొందరు చిరువ్యాపారాలు చేసుకునే పరిస్థితులు వచ్చాయన్నారు. ఇసుక కొరత వల్లే కార్మికులకు ఈ దుస్థితి వచ్చిందని, అందుకు పూర్తి బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. ట్రాక్టర్ ట్రక్కు ఇసుక రూ.6 వేలు పలుకుతోందని, కొందరు బడాబాబులు ఇసుకను బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ఉచిత ఇసుక విధానం పూర్తిగా అమలు చేయాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళన బాటపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆవులయ్య, అన్వర్, ఖాజావలి, నియోజకవర్గంలోని భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్ ట్యాంకు పనులు ప్రారంభించాలి

పొదిలి: పట్టణానికి తాగునీటిని అందించే సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఎం పొదిలి ప్రాంతీయ కమిటీ తీర్మానించింది. ఆదివారం జరిగిన ఐదో మహాసభల తీర్మానాలను పార్టీ ప్రాంతీయ కమిటీ కన్వీనర్ పి.బాలనరసయ్య ఓ ప్రకటనలో తెలిపారు. 'పట్టణంలో సైడు కాలువలపై ఆక్రమణలు తొలగించిన అధికారులు కాలువల నిర్మాణం గురించి పట్టించుకోలేదు. దుకాణాలు, ఉపాధి కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపెట్టాలి. పొదిలి ప్రాంతంలోని మూడు మండలాలను వెలుగొండ ప్రాజక్టు పరిధిలోకి చేర్చాలి. నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే లైను పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. నగర పంచాయతీకి నిధులు కేటాయించి సైడు కాలువల నిర్మాణం, అంతర్గత రోడ్లు, డివైడర్లు ఏర్పాటు చేయాలి. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. అగ్నిమాపక కేంద్రం త్వరితగతిన నిర్మించాలి. మహిళా ప్రయాణికుల సౌకర్యార్థం చిన్న బస్టాండ్, పెద్ద బస్టాండ్‌లో సులభ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయాలి. జగనన్న కాలనీలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలి' అని తీర్మానించినట్లు వివరించారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఎం.రమేష్, ఎన్.వెంకటేశ్వరరెడ్డి, కోటేశ్వరరావు, ఎస్‌కె.బాజీ, ఎస్.నాగయ్య, ఎం.పార్వతి పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న ఓప మల్లిక్


పాటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మార్కాపురం: గ్రంథాలయాలను విద్యార్థులతోపాటు ప్రతి ఒక్కరూ ఉపయోగించుకుని పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని యజ్ఞోపవీతం, సాయి సన్నిధానం పత్రికల సంపాదకుడు ఓపి మల్లిక్ సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ మాస్టర్లుగా పి.ఆదినారాయణ, ఓవీ రవిశేఖర్‌రెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా మల్లిక్ మాట్లాడుతూ పోటీపరీక్షలకు సిద్ధమయ్యేవారు గ్రంథాలయాల్లో పుస్తకాలు చదివి విజేతలుగా నిలవచ్చన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను రోజూ గ్రంథాలయాలకు పంపాలని సూచించారు. గ్రంథ పాలకుడు జీవీ శివారెడ్డి మాట్లడుతూ.. విద్యార్థులు సెల్‌ఫోన్లను వదిలి పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన చంద్రిక, నాగభార్గవి, వసంత, మధురిమ మొదటి బహుమతి గెలుచుకున్నారు. జెడ్పీ బాయ్స్ స్కూల్ విద్యార్థులు జాన్‌డేవిడ్, హర్ష, ఖయ్యూమ్, శ్రీనివాసులు రెండో స్థానంలో నిలవగా ఓం సాయివికాస్ హైస్కూల్ విద్యార్థులు, వాసవీ విద్యార్థులు మూడో స్థానం సొంతం చేసుకున్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో రిటైర్డు ఆర్జేడీ డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి, దిట్టకవి శ్రీనివాసాచార్యులు, తోట శ్రీనివాసరావు, ఆదినారాయణ, లావణ్య, అమీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధి సంఘం ఏర్పాటు

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకునేందుకు ప్రజలు, విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు గ్రంథాలయ సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు లైబ్రేరియన్ జి.శివారెడ్డి తెలిపారు. గ్రంథాలయ వనరులను పెంపొందించడం, విద్యార్థుల్లో, ప్రజల్లో చదవడాన్ని అలవాటు చేయడం కమిటీ లక్ష్యమన్నారు.

తర్లుపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథ పాలకుడు పీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. కవుల విశిష్టత గురించి విద్యార్థులకు బి.పుల్లయ్య వివరించారు. అనంతరం సీనియర్స్, జూనియర్స్ విభాగాలకు నిర్వహించిన పాటల పోటీల్లో సుమారు 78 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డి.గురవారెడ్డి, రఘునాథరెడ్డి, తెలుగు పండిట్ రామయ్య, ఉపాధ్యాయులు గాయం లక్ష్మీరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు పాల్గొన్నారు.

తాపీగా కూర్చున్నారా.. తలలు పగిలినట్టే!


ప్లాట్‌ఫాం వద్ద పడిన శ్లాబ్ పెచ్చులు

- పొదిలి ఆర్టీసీ డిపోలో పెచ్చులూడుతున్న శ్లాబ్

పొదిలి: స్థానిక ఆర్టీసీ డిపోలో శ్లాబు పెచ్చులూడుతుండటంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం దర్శి, అద్దంకి ప్లాట్‌ఫాంపై పెచ్చులూడి కింద పడింది. అయితే అదృష్టవశాత్తూ ఆ సమయంలో ప్రయాణికులు ఎవరూ లేకపోవటంతో ఇబ్బంది జరగలేదు. ప్లాట్‌ఫాంలు మొత్తం పై భాగంలో శ్లాబు చివరన శిథిలావస్థకు చేరింది. దీంతో కొద్దికొద్దిగా పెచ్చులు ఊడిపడుతున్నాయి. గతంలో పలుమార్లు ఇలా జరిగినప్పటికీ తాత్కాలిక మరమ్మతులకు కూడా నోచుకోలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాలని ప్రయాణికులతోపాటు ఆర్టీసీ ఉద్యోగులు కూడా కోరుతున్నారు.


పెచ్చులూడుతున్న సన్‌షేడ్

బురద రోడ్డే పూలపాన్పు!


బురదలో జారి బోర్లాపడిన మందుబాబు

బేస్తవారిపేట: స్థానిక జంక్షన్‌లో చెట్టిచర్లకు వెళ్లే రోడ్డు పక్కన మంచినీటి పైపులైన్ మరమ్మతుల కోసం లోతైన గుంత తీశారు. ఈ మట్టిని రోడ్డుకు ఒకవైపున వేయడంతో చిన్నపాటి వర్షం పడిన బురదమయంగా మారుతోంది. పూటుగా మద్యం సేవించిన ఒకరు ఊగుతూ అడుగుతీసి అడుగువేసే ప్రయత్నం చేస్తూ బురదలో జారి బోర్లా పడ్డాడు. మత్తు నశాలానికి ఎక్కడంతో పైకి లేచే సత్తువ లేక బురదలోనే నిద్రలోకి జారుకున్నాడు.

బిల్లు చూడకుంటే జేబుకు చిల్లే!

కంభం: నిత్యావసర వస్తువులు కొనే సమయంలో ఏమరపాటుగా ఉంటే జేబుకు చిల్లు తప్పదని తెలిపే ఉదంతమిది. కంభం ఇటీవల ఏర్పాటు చేసిన ఓ సూపర్ మార్కెట్‌లో ఆఫర్లకు ఆకర్షితులైన ప్రజలు బారులుదీరుతున్నారు. గత నెలలో ఓ కొనుగోలుదారుడు సర్ఫ్ ఎక్సెల్ లిక్విడ్‌పై రూ.75/– తక్కువ ఆఫర్ ఉందని కొని బిల్లు వేయించుకోగా ఆఫర్ ధర కాకుండా పాత రేటుకే బిల్లు వేశారు. కొనుగోలుదారుడు అది గమనించి ప్రశ్నించగా ఎక్కడో పొరపాటు జరిగిందని డబ్బులు వెనక్కి ఇచ్చారు. శనివారం రాత్రి ఓ కస్టమర్ బ్రెడ్ రూ.18/– ఆఫర్ ధర అని ఉండటంతో కొనుగోలు చేసి బిల్లు వేయించగా పాత ధర రూ.40.20 వసూలు చేశారు. కొనుగోలుదారుడు గమనించి ప్రశ్నించగా పొరపాటు జరిగిందని డబ్బులు వెనక్కు ఇచ్చారు. ఇదే తరహా సంఘటనలు తరచూ పునరావృతం అవుతున్నాయని, బిల్లులు గమనించి జాగ్రత్తగా ఉండకపోతే నష్టపోవాల్సి వస్తుందని స్థానికంగా చర్చ నడుస్తోంది.


బిల్లు పై రూ.18 బ్రెడ్ కు రూ. 40.20 పైసలు



బ్రెడ్ పై రూ. 18.00 గా వేసి ఉన్న ధర, బార్ కోడ్

నేటి నుంచి సత్యసాయి జన్మదిన వేడుకలు

గిద్దలూరు రూరల్: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 99వ జన్మదిన వేడుకలను సోమవారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు ఎస్.అనంతరామయ్య తెలిపారు. 18న సత్యసాయి సామూహిక సత్యనారాయణ వ్రతాలు, 19న సుప్రభాతం, నగర సంకీర్తన, పల్లకిసేవ, రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల పంపిణీ, 20న సాయి గాయత్రి మంత్ర పఠనం, మంగళహారతి, 21న బాల వికాస్ నాటక ప్రదర్శన, 22న సత్యసాయి సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు, 23న సత్యసాయి పాదుకలకు అష్టోతర శతనామావళి పూజ, మహానారాయణ సేవ, కేక్ కటింగ్ కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో వివరించారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు


కళాశాల రోడ్డులో పూజలందుకున్న పోలేరమ్మ తల్లి


ప్రత్యేక అలంకారంలో అల్లూరి పోలేరమ్మ

మార్కాపురం టౌన్: పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ తల్లికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారి మూలవిగ్రహ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. నాగ శిలలు, పుట్ట వద్ద భక్తులు పూజలు చేసి, ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, తదితరులు పర్యవేక్షించారు. అలాగే కళాశాల రోడ్డులోని పోలేరమ్మ తల్లి ఆలయంలో భక్తులు మొక్కులు చెల్లించారు. అర్చకులు వేకువ జామునే అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.